కనులపండువగా.. కార్తీక దీపోత్సవం



కార్తీక మాసం సందర్భంగా జిల్లాకేంద్రంలో ఉన్న ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించారు. దీప కాంతులతో మిరిమెట్లు గొలుపుతూ మెరిసి ఆలయాలు పోయాయి. శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. - ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

నాచగిరిలో కార్తీక సోమవారం దీపారాధనలతో శోభిల్లింది. కార్తీక మాసంలో రోజూ సాయంత్రం దీపారాధన జరగాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీలక్ష్మీనృసింహుని ఆలయ ప్రాంగణంలో 1,008 ప్రమిదలను, వత్తులను ఆలయ అధికారులు సమకూర్చారు. దీపోత్సవంలో.. మహిళలు దీపాలు వెలిగించి తరించారు. భక్తులకు తాంబూలంగా కనుము, గాజులు, తమలపాకులు, కుంకుమ, పసుపు, ఫలాలను ఆలయ ఈఓ అన్నపూర్ణ అందజేశారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు కూడా జరిగాయి. - వర్గల్(గజ్వేల్)



ప్రమిదలు వెలిగిస్తున్న మహిళలు



కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఆదేశానుసారం కార్తీక మాసం సందర్భంగా సోమవారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ఈ మాసంలో రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు దీపోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపను పొందాలని సూచించారు. - కొమురవెల్లి(సిద్దిపేట)

క్లుప్తంగా

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి



గొల్లపల్లి పత్తి మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శ్రీనివాస పత్తి మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన పత్తిని ఈ కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని కోరారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. తేమ శాతం లేకుండా పంట తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల నిర్మాణం చేపడుతున్నాం

మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్



దుబ్బాకలో మురుగు కాలువల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రమేశ్ కుమార్

దుబ్బాకటౌన్: మురుగునీటి సమస్యల పరిష్కారానికి నూతన కాలువల నిర్మాణం చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ. 2 లక్షలతో చేపట్టిన నూతన మురుగు కాల్వ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డులో అవసరమున్న చోట నూతనంగా నిర్మాణం చేపడుతున్నట్లు సూచించారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా సోమవారం 16 కుక్కలను సిద్దిపేటలోని యానిమల్ కేర్ సెంటర్‌కు తరలించామన్నారు. కు.ని శస్త్ర చికిత్సలు పూర్తయిన అనంతరం తిరిగి దుబ్బాకలో వదిలిపెడతామని సూచించారు. కార్యక్రమంలో మున్సి పల్ సిబ్బంది విష్ణు, అనిల్ తదితరులు ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 24 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.41వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

డైట్ చార్జీల పెంపుపై సంబురాలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు

హుస్నాబాద్: ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా సోమవారం పట్టణంలోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సంబురాలు జరుపుకొన్నారు. ఉపాధ్యాయినులు, విద్యార్థినులు కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, గురుకుల సొసైటీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?

- బీటీ రోడ్డుకు నోచని బొడిగేపల్లి- గోవర్ధనగిరి
- మట్టి రోడ్డంతా గుంతలు.. ఏళ్లుగా జనం అవస్థలు
- మంత్రి పొన్నం దృష్టి సారించాలని వేడుకోలు

అన్నపేట మండలం.. బొడిగేపల్లి నుంచి గోవర్ధనగిరి గ్రామాల అనుసంధాన రహదారి బీటీ రోడ్డుకు నోచడం లేదు. మట్టి రోడ్డుకు గుంతలు ఏర్పడి చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నడవడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. వర్షాకాలంలో రాకపోకలు సాగడం కష్టతరంగా మారింది. అలాగే సంజీవరాయిగుట్ట వద్ద జాతర ప్రతీ ఏడాది జరుగుతోంది. ఇక్కడి వచ్చేవారికి సైతం ఈ రహదారే దిక్కు.. దీంతో వారికి ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా మంత్రి పొన్నం చొరవ తీసుకుని బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.



గుంతలు పడిన బొడిగేపల్లి నుంచి గోవర్ధనగిరి మట్టిరోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): బొడిగేపల్లి-గోవర్ధనగిరి గ్రామాల మధ్యలో సంజీవరాయిగుట్ట ఉంటుంది. ఈ గుట్టపై కొలను, ఆంజనేయ స్వామి దేవాలయం ఉంటుంది. అలాగే గుట్ట కింద సమ్మక్క-సారలమ్మ జాతర కూడా ఘనంగా నిర్వహిస్తారు. ఈ ప్రాంతానికి చుట్టుపక్కలా నాలుగైదు గ్రామాల నుంచి భక్తులు, ప్రకృతి ప్రియులు వస్తుంటారు. కానీ రోడ్డు మార్గం సరిగ్గా లేకపోవడంతో దశాబ్దాలుగా అవస్థలు పడుతూనే తరలి వస్తున్నారు. వర్షా కాలంలో అయితే రోడ్డు పొడవునా గుంతలు పడి బురదమయంగా ఉన్నా గానీ ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ మట్టి రోడ్డు మార్గం ద్వారా అక్కన్నపేట మండలానికి గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా గ్రామాలతో పాటు పలు పల్లెవాసులు వెళ్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఏళ్ల తరబడి నుంచి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ మట్టి రోడ్డును బీటీగా మార్చేందుకు ఏళ్ల తరబడి ప్రతిపాదనలు పంపుతున్నా మోక్షం లభించడంలేదు. ఇప్పటికైనా స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టిసారించి బీటీ రోడ్డుగా మార్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజల అవస్థలు వర్ణనాతీతం



బొడిగేపల్లి -గోవర్ధనగిరి గ్రామ లింకు రోడ్డు ఏళ్ల తరబడి ఏర్పడిన గుంతలు వల్ల ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన తర్వాత మరిచిపోతున్నారు. రాకపోకలు సరిగ్గా లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

- గొల్లపల్లి వీరాచారి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్రకార్యవర్గసభ్యుడు

మురుగు నీరు.. జనం బేజారు!



హరిప్రియనగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు

సిద్దిపేటజోన్: మురుగునీటితో ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. ఆ నీరు నిల్వ ఉండటంతోపాటు దుర్గంధపూరితమైన వాసన వెదజల్లుతోంది. ముక్కులు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. విషయానికొస్తే.. సిద్దిపేటలోని కొన్ని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉప్పొంగి నీరు రోడ్డుపైకి చేరుతోంది. దుర్వాసన రావడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధిస్తాం

30న సంకల్ప దీక్ష : జేఏసీ చైర్మన్ పరమేశ్వర్



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతామని, అందుకోసం ఈ నెల 30న సంకల్ప దీక్ష నిర్వహిస్తున్నామని జేఏసీ చైర్మన్ డా.రామగల్ల పరమేశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలో జేఏసీ కార్యాలయాన్ని పలు ప్రజా సంఘాలు, కుల సంఘాలు, వివిధ పార్టీల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను సభ్యులకు వివరించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక తెలిపారు. ఈ నెల రెండవ వారంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లను కలిసి చేర్యాల ప్రాంత భౌగోళిక, రాజకీయ పరిస్థితులను వివరిస్తామన్నారు. డివిజన్‌గా ప్రకటించాలని వినతి పత్రాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ జేఏసీ ప్రతినిధులు ఆగంరెడ్డి, జీవన్‌రెడ్డి, ఉమారాణి, శ్రీధర్‌రెడ్డి, అశోక్, బీరయ్య, యాదయ్య, శ్రీకాంత్, నరేందర్ పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ భగ్నం

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు



హుస్నాబాద్ : పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు



సిద్దిపేట రూరల్‌లో..

చలో హైదరాబాద్‌ను పోలీసులు భగ్నం చేశారు. మాజీ సర్పంచ్‌లను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులకు తెగబడ్డారు. రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఏదిఏమైనా అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, పెండింగ్ బిల్లులు చెల్లించేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. - నెట్‌వర్క్

రత్నంకు అభినందనలు

కొమురవెల్లి(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు పాటల రూపంలో ప్రగతిపథంలో ప్రజా పాలన అనే పుస్తకాన్ని తెలంగాణ సాంస్కృతిక, సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో రూపొందించారు. మండలంలోని అయినాపూర్‌కు చెందిన పిన్నింటి రత్నం రచించిన రెండు పాటలు ఇందులో ఉండటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు పరుస్తున్న 6 గ్యారంటీలు, పథకాలపై జానపద శైలిలో ఈ పాటలను రచించినట్లు తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ప్రధాన సంపాదకులు హరికృష్ణకు ధన్యావాదాలు తెలిపారు.

క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని డీఐఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-19 బాలబాలికల విభాగంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు.

ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలి



నంగునూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న తహసీల్దార్



దుబ్బాకటౌన్: పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్వేపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ అలీ

ప్రతీ ఇంటిని సర్వే చేయాలని తహసీల్దార్లు తెలిపారు. సోమవారం జిల్లావ్యాప్తంగా కులగణనపై మండలస్థాయి అధికారులకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లను నియమించామన్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ అని వెల్లడించారు. పలువురు ట్రైనర్లు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్వేలో అడగాల్సిన ప్రశ్నలను తెలిపారు. ఆయా కార్యక్రమంలో ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీడీపీఓలు, టీచర్లు, గ్రామకార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్



హుస్నాబాద్‌రూరల్‌లో.. ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

మంత్రి సురేఖను కలిసిన నేతలు

సిద్దిపేటకమాన్: మంత్రి సురేఖను కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి చేనేత చీర, జ్ఞాపికలను బహూకరించారు. నియోజక వర్గ అభివృద్ధి, పథకాల అమలపై చర్చించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట పలువురు నేతలు ఉన్నారు.



మంత్రి కొండా సురేఖకు చేనేత చీరను అందజేస్తున్న శ్రీనివాస్, తదితరులు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

కొండపాక(గజ్వేల్): కొనుగోలు కేంద్రానికి తెచ్చే పత్తి తేమ లేకుండా, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. కొండపాక మండలం వెలికట్ట శివారులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా కాటన్ మిల్ యాజమానులకు కొనుగోళ్లపై పలు సూచనలు చేశారు.

కలెక్టర్‌కు వినతి

చేర్యాల(సిద్దిపేట): ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ మనుచౌదరికి ఆయన వినతి పత్రం అందించారు. ఈయన వెంట రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లారపు తిరుపతిరెడ్డి, రైతులు నర్సింహా రెడ్డి, సిద్ధులు, పోచయ్య, లింగయ్య, మల్లయ్య ఉన్నారు.

కఠిన చర్యలు తప్పవు: ఎస్ఐ

దౌల్తాబాద్ (దుబ్బాక): రైతులు రోడ్లపై ధాన్యం పోసి ఇతరుల మరణానికి కారణం కావొద్దని ఎస్ఐ శ్రీ రామ్ ప్రేమ్ దీప్ సోమవారం అన్నారు. అనంతరం రోడ్లపై ధాన్యం పోసి టార్పాలిన్లు కప్పడం వల్ల రాత్రి సమయాలలో ప్రయాణించే వారికి కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల స్కూల్, కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, షీ టీమ్, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుల్లో రాణించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల గజ్వేల్‌లో పీజీటీ ఉర్దూ, టీజీటీ ఉర్దూ సబ్జెక్టు పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ అహ్మద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 7వరకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

◆ తహసీల్దార్‌గా హరికిషన్ బాధ్యత స్వీకరణ

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల తహసీల్దార్‌గా హరికిషన్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ స్థానంలో పని చేసిన గోవర్ధన్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించిన హరికిషన్‌ను డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛంతో ఘనంగా స్వాతగం పలికారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన తహసీల్దార్ మాట్లాడుతూ, రెవెన్యూ సంబంధ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

◆ పకడ్బందీగా కుటుంబ సర్వే

సిద్దిపేటజోన్: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు శ్రీకారం చుట్టిందని, ప్రణాళికాబద్ధంగా సర్వే ప్రక్రియ నిర్వహించాలని సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీమ్ మియ్యా, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌లు సూచించారు. సోమవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో సర్వే నిర్వహణ అధికారులు, సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించారు. ఈనెల 6 నుంచి సర్వే ప్రారంభించి, ఈనెల 30లోగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని 43 వార్డుల్లో ప్రతీ ఇంటికి సిబ్బంది వెళ్లి నిర్దిత అంశాల ఆధారంగా సర్వే చేపట్టాలని సూచించారు.

◆ బండమైలారంలో ఆరోగ్య సర్వే

ములుగు(గజ్వేల్): క్షీరసాగర్ గ్రామ హంస హోమియోపతి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రం విద్యార్థులు సోమవారం మండలంలోని బండమైలారంలో ఆరోగ్య సర్వే నిర్వహించారు. గ్రామంలోని ప్రతీఇంటికి వెళ్లి ఆరోగ్య సంబంధిత విషయాలను అడిగి తెలుసుకొని సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామస్తులు ఎక్కువ శాతం బీపీ, షుగర్, కీళ్ల వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. త్వరలోనే వైద్యశిబిరం నిర్వహించి వైద్యసేవలు అందజేస్తామని హంస హోమియోపతి డైరెక్టర్‌లు డాక్టర్ ఉమేశ్, డాక్టర్ పద్మజ తెలిపారు.

◆ సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారులోని వాసవి కాటన్ ఇండస్ట్రీస్‌లో సోమవారం సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎం ప్రసాద్ మాట్లాడుతూ, సీసీఐ కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని సంపూర్ణ మద్దతు ధర పొందాలన్నారు. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తి క్వింటాలుకు రూ.7,521 నుంచి రూ.7,220 మద్దతు ధర ఉంటుందన్నారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

దుబ్బాకరూరల్: ఎదురెదురుగా వచ్చి కారు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని తిమ్మాపూర్ వద్ద జరిగింది. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాలు... మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన కోతి చంద్రం హబ్సిపూర్ నుంచి సిద్దిపేట వైపు బైక్‌పై వెళ్తున్నాడు. సిద్దిపేట వైపు నుంచి రామాయంపేటకు కారు వస్తోంది. తిమ్మాపూర్ వద్దకు రాగానే ఈ రెండు ఢీకొనగా చంద్రంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది చేరుకున్నారు. ఈ మేరకు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీకి తరలించారు.

మరో ఘటనలోను..

అక్కన్నపేట(హుస్నాబాద్): కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామ ప్రధాన రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వేముల ప్రభాకర్ ద్విచక్ర వాహనంపై గుంటూరుకు వెళ్తున్నాడు. అంతక్కపేటలో ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొట్టుకున్నాయి. దీంతో ప్రభాకర్ తలకు, కాళ్లకు తీవ్ర గాయమైంది. దీంతో స్థానికులు 108కు ఫోన్ చేయగా ఇక్కడికి చేరుకున్న సిబ్బంది చికిత్స నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించించారు.